


## వెల్డన్ నవీన్.. : కేసీఆర్

శాసనమండలి ఉపఎన్నికల్లో గెలుపొందిన నవీన్‌కుమార్‌రెడ్డిని పార్టీ అధినేత కేసీఆర్ అభినందించారు. మహబూబ్‌నగర్‌లో కౌంటింగ్ ముగిశాక హుటాహుటిన పార్టీ నేతలతో కలిసి ఎమ్మెల్సీ నవీన్ హైదరాబాద్‌కు చేరుకున్నారు. గులాబీబాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. నవీన్‌ను శాలువాతో సన్మానించి కేసీఆర్ అభినందించారు. వెల్డన్ నవీన్.. అంటూ భుజం తట్టారు. అంతకుముందు కేటీఆర్.. నవీన్‌కు ఫోన్ చేసి అభినందించారు. గెలిపించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. అలాగే మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును కూడా నవీన్ కలిశారు.

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో బీఆర్‌ఎస్ నేతలతో కలిసి విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న నవీన్‌కుమార్‌రెడ్డి, (ఇన్‌సెట్లో) నవీన్ కుటుంబసభ్యుల విజయ సంకేతం



# సీఎం ఇలాకాలో నవీన్ తడాఖా

ధన బలం ముందు గెలిచిన జన బలం

- మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో విజయ ఢంకా మోగించిన బీఆర్‌ఎస్
- కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిపై 109 ఓట్ల తేడాతో గెలిచిన నవీన్‌కుమార్‌రెడ్డి
- అధికార పార్టీకి బిగ్‌షాక్ ఇచ్చిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు
- అధికారం అడ్డుపెట్టుకున్నా.. ప్రలోభాలకు గురిచేసినా లొంగని పాలమూరు



నవీన్‌రెడ్డికి గెలుపు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న మహబూబ్‌నగర్ కలెక్టర్ రవినాయక్

మహబూబ్‌నగర్, జూన్ 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : సీఎం సొంత జిల్లాలో కాంగ్రెస్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల శాసనమండలి ఉప ఎన్నికల్లో హస్తం పార్టీ అభ్యర్థి ఘోర పరాజయం మూటగట్టుకున్నారు. మన్నె జీవన్‌రెడ్డిపై 109 ఓట్ల తేడాతో బీఆర్‌ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి ఘన విజయం సాధించారు. సాక్షాత్తు సీఎం రేవంత్ సొంత నియోజకవర్గం కొడంగల్‌లో కారు జోరు కనిపించింది. ఇక్కడి ప్రజాప్రతినిధులు గులాబీ పార్టీవైపే నిలబడ్డారు. శాసన మండల ఉపఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమిపాలవడంతో ఒక్కసారిగా ఆ పార్టీ శ్రేణులు షాక్‌కు గురయ్యారు. ఓటమిపై సైలెంట్ అయ్యారు. ఓ మామూలు మాజీ జెడ్పీటీసీ సత్తా చాటడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్సీగా గెలుపొందిన నవీన్‌కుమార్‌రెడ్డిని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫోన్ చేసి అభినందించారు. కాగా జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బీఆర్‌ఎస్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించిన స్థానిక ప్రజాప్రతినిధులను అభినందించారు. ఈ విజయాన్ని అమరవీరులకు అంకితమిస్తున్నట్లు మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ప్రకటించారు. తనను ఆదరించి గెలిపించిన ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు, ఎక్స్ అఫీషియల్ సభ్యులకు నవీన్‌కుమార్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఈ విజయాన్ని కేసీఆర్‌కు కానుకగా ఇస్తున్నట్లు ప్రకటించారు. ప్రజాప్రతినిధుల శాసనమండలి సభ్యుడిగా ఎన్నికైన నవీన్ కుమార్‌రెడ్డికి రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ రవినాయక్ గెలుపు ధ్రువపత్రాన్ని అందజేశారు. అనంతరం కౌంటింగ్ కేంద్రం ఎదుట భారీ ఎత్తున పార్టీ శ్రేణులు సంబురాలు చేసుకున్నారు. పటాకులు కాలుస్తూ కేసీఆర్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. ఎమ్మెల్సీగా గెలుపొందగానే మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డితోపాటు ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి పార్టీ అధినేత కేసీఆర్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. కాగా ఓటమిని ముందే గ్రహించిన కాంగ్రెస్ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి కౌంటింగ్ హాల్ నుంచి బయటకు వెళ్లిపోయారు. కాంగ్రెస్ ఓటమిపై ఎమ్మెల్యేలు సైలెంట్ కావడం.. ఉప ఎన్నికల్లో ఓటమి ఆ పార్టీ శ్రేణుల్లో తీవ్ర నిరాశ కలిగించింది.

***కౌంటింగ్ సమయంలో ఉత్కంఠ..***

ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో ఓట్ల కౌంటింగ్ ప్రక్రియలో అనుక్షణం ఉత్కంఠ మొదలైంది. బీఆర్‌ఎస్ శ్రేణులు ముందుగానే గెలుపుపై ధీమాతో ఉన్నారు. దీంతో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి నేతృత్వంలో మాజీ ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, అంజయ్య యాదవ్ కౌంటింగ్ ఏజెంట్లుగా వ్యవహరించారు. ఉదయం 7 గంటలకే కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూములు తెరిచి బ్యాలెట్ బాక్స్‌లను కౌంటింగ్ కేంద్రానికి తరలించారు. అనంతరం బాక్స్‌లో ఉన్న బ్యాలెట్ పత్రాలను తీసి ఒక డబ్బాలో వేశారు. వాటన్నింటినీ కలిపి 25 ఓట్ల చొప్పున బెండళ్లు కట్టారు. మొత్తం 1,437 ఓట్లు పోలవగా.. ఆ తర్వాత ప్రాధాన్యత క్రమంలో ఒక్కొక్క ఓటు లెక్కించారు. కోటా ఓట్లు నిర్ధారించి ఆపై వచ్చిన ఒక్క ఓటుతో అభ్యర్థి గెలుపొందినట్లు ప్రకటించారు. కాగా కట్టలు కట్టిన బ్యాలెట్ పత్రాల నుంచి ఒక్కో ఓటును ప్రాధాన్యత క్రమంలో కౌంటింగ్ టేబుల్స్‌పై వేస్తుంటేనే కాంగ్రెస్ నాయకులు డీలా పడిపోయారు. బీఆర్‌ఎస్ అభ్యర్థికి ఎక్కువ మొత్తం ఓట్లు రావడంతో అప్పటికే ఓటమి నిర్ధారించుకున్నారు. కౌంటింగ్‌హాల్‌లో ఉన్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి మొహం పాలిపోయింది. దీంతో ఆయన కౌంటింగ్ హాల్ నుంచి మీడియా కంటపడకుండా వెళ్లిపోయారు. కాగా బీఆర్‌ఎస్ అభ్యర్థి నవీన్ బయటకు వచ్చి ఆధిక్యతలో ఉన్నానని ప్రకటించడంతో ఒక్కసారిగా మీడియా సెంటర్‌లో బీఆర్‌ఎస్ విజయం వైపు వెళ్తున్నదని ఖాయమైంది.



నవీన్‌ను అభినందిస్తున్న నిరంజన్‌రెడ్డి

## పక్కా ప్రణాళికతో బీఆర్‌ఎస్




నవీన్‌ను అభినందిస్తున్న బండ్ల, అంజయ్యయాదవ్

ఎమ్మెల్సీ ఉపఎన్నిక నోటిఫికేషన్ వచ్చిన నాటి నుంచి బీఆర్‌ఎస్ పార్టీ పకడ్బందీగా వ్యూహరచన చేసింది. ఎమ్మెల్సీగా ఎవరు పోటీ చేస్తారన్న దానిపై ఉత్కంఠ నెలకొనగా.. చాలామంది మాజీ ఎమ్మెల్యేల పేర్లు పరిశీలనకు వచ్చాయి. కాగా షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ తన నియోజకవర్గానికి చెందిన నవీన్‌కుమార్‌రెడ్డికి టికెట్ ఇవ్వాలని పట్టుబట్టారు. దీంతో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మాజీ జెడ్పీ వైస్ చైర్మన్, షాద్‌నగర్‌కు చెందిన నవీన్‌కుమార్‌రెడ్డి పేరు తెరమీదకు వచ్చింది. పార్టీ అధినేత టికెట్ ఇవ్వడంతో శ్రేణులంతా అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిని చాలెంజ్‌గా తీసుకొని ఎలాగైనా గెలవాలని.. అధికార పార్టీకి షాక్ ఇవ్వాలని భావించారు. అందుకు తగ్గట్టుగానే ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి, బీరం హర్షవర్ధన్‌రెడ్డి, గువ్వల బాలరాజు, జైపాల్ యాదవ్, పట్నం నరేందర్‌రెడ్డి, అంజయ్య యాదవ్‌తో పాటు పార్టీ నేతలు స్థానిక ప్రజాప్రతినిధులను గడప దాటకుండా కట్టడి చేశారు. ఈలోపు కాంగ్రెస్ అధికారంలో వచ్చినా గ్యారెంటీలను అమలు చేయకపోవడం.. ప్రజా వ్యతిరేకత రావడంతో స్థానిక ప్రజాప్రతినిధులు ఆ పార్టీలోకి వెళ్లడానికి జంకారు. ఇది కూడా బీఆర్‌ఎస్‌కు కలిసి వచ్చింది. దీంతో నియోజకవర్గాల్లో ఉన్న బీఆర్‌ఎస్ ముఖ్య శ్రేణులు పక్కావ్యూహంతో ముందుకు కదిలారు. ప్రజాప్రతినిధులకు పార్టీ పరిస్థితిని వివరించి మనమంతా కేసీఆర్ వెంటే ఉండాలని పిలుపునిచ్చారు. కాగా, అధికార పార్టీ ప్రలోభాలకు గురిచేసినా పార్టీ మారలేదు. ఎమ్మెల్సీ ఎన్నికల చివరి రోజు వరకు కాంగ్రెస్ అనేక కుయుక్తులు పన్నింది. ఇక పోలింగ్ ముగియగానే బీఆర్‌ఎస్ గెలుస్తుందని ఎగ్జిట్‌పోల్స్ అంచనా వేశాయి. దీంతో భయపడిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కమిషన్‌ను ఆశ్రయించి పార్లమెంట్ ఎన్నికల కోడ్‌ను అడ్డంపెట్టి ఎన్నికలు పూర్తయ్యే వరకు కౌంటింగ్‌ను నిలిపివేయించింది. చివరకు అనుకున్నట్లే బీఆర్‌ఎస్ అభ్యర్థి అనూహ్యంగా విజయం సాధించారు.

## కాంగ్రెస్‌కు బిగ్ షాక్



ఓటమి ఖాయమని తెలుసుకొని కౌంటింగ్ మధ్యలోనే హాల్ నుంచి బయటకు వెళ్లిపోతున్న మన్నె జీవన్‌రెడ్డి

శాసనమండలి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు అనేక అడ్డదారులు తొక్కింది. ప్రజాప్రతినిధుల సంఖ్యాబలం లేకున్నా ఆయా ఎమ్మెల్యేలను అడ్డం పెట్టుకొని ప్రజాప్రతినిధులను పార్టీ వైపు వచ్చేలా వారిపై ఒత్తిడి తీసుకొచ్చారు. ఈ క్రమంలో కొన్ని నియోజకవర్గాల్లో కొందరు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్‌కు సపోర్ట్ చేస్తే వచ్చే స్థానిక ఎన్నికల్లో మీకే టికెట్లు ఇస్తామని, గెలిచేందుకు కావాల్సిన వనరులు సమకూరుస్తామని ఒప్పించారు. అయినా చాలామంది ప్రజాప్రతినిధులు బీఆర్‌ఎస్ వైపు కట్టుబడి ఉన్నారు. కాగా ఎన్నికల ముందు వరకు ఎంపీ మన్నె సోదరుడి కొడుకు మన్నె జీవన్‌రెడ్డి బీఆర్‌ఎస్‌లోనే ఉన్నారు. అధికారం మారడంతో ఆయన కూడా పార్టీ మారారు. దీంతో పారిశ్రామికవేత్త... ధనబలం ఉన్న జీవన్‌రెడ్డికి టికెట్ ఇచ్చింది. సాక్షాత్తు సీఎం రేవంత్‌రెడ్డి 200 ఓట్లతో గెలుస్తున్నట్లు అనేక సందర్భాల్లో ధీమా వ్యక్తం చేశారు. అయితే అందుకు భిన్నంగా ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు అధికార పార్టీకి భారీ ఝలక్ ఇచ్చారు.



జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో సంబురాలు చేసుకుంటున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

## విజయోత్సవ సంబురం



మహబూబ్‌నగర్‌లో డ్యాన్స్ చేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, జూన్ 2 : తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజునే ఎమ్మెల్సీ ఎన్నికలో నవీన్‌కుమార్‌రెడ్డి విజయం సాధించడంతో ఉమ్మడి జిల్లా గులాబీ శ్రేణుల్లో జోష్ నిండింది. బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలిచాడన్న విషయం తెలుసుకున్న పార్టీ కార్యకర్తలు, నాయకులు, షాద్‌నగర్ నుంచి అభిమానులు కౌంటింగ్ కేంద్రం వద్దకు భారీగా తరలివచ్చారు. కౌంటింగ్ కేంద్రం వద్దకు మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, అంజయ్యయాదవ్, శాట్ మాజీ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి చేరుకొని నవీన్‌కుమార్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. అనంతరం అధికారికంగా విజయం సాధించినట్లు కలెక్టర్ రవినాయక్ ఎన్నిక ధ్రువీకరణ పత్రాన్ని నవీన్‌కుమార్‌రెడ్డికి అందజేశారు. కౌంటింగ్ కేంద్రం నుంచి నవీన్‌కుమార్‌రెడ్డి బయటకు రాగానే బీఆర్‌ఎస్ శ్రేణుల జై తెలంగాణ, జై కేసీఆర్ నినాదాలు మార్మోగాయి. అక్కడి నుంచి న్యూటౌన్ చౌరస్తా వరకు బీఆర్‌ఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వచ్చి ఆయనకు పూలదండలు వేస్తూ గులాబీ పూలవర్షం కురిపిస్తూ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. డప్పులు కొడుతూ స్వీట్లు పంచుతూ పటాకులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. దారి పొడవునా బీఆర్‌ఎస్ కార్యకర్తల సంబురాలు అంబరాన్నంటాయి.

## కట్టుదిట్టంగా కౌంటింగ్

- కాంగ్రెస్‌పై బీఆర్‌ఎస్ విజయం
- హక్కుల కోసం పోరాడుతా.. : ఎమ్మెల్సీ నవీన్

మహబూబ్‌నగర్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఎమ్మెల్సీ ఉపఎన్నిక కౌంటింగ్ ఆదివారం ఉదయం 8 గంటలకు ప్రారంభమైంది. 1,437 ఓట్లు పోల్ కాగా.. 1,416 వ్యాలిడ్, 21 ఇన్‌వ్యాలిడ్‌గా గుర్తించి.. 709 ఓట్లను కోటాగా నిర్ణయించారు. వ్యాలిడ్ ఓట్లను మొదటి ప్రాధాన్యత కింద లెక్కించగా బీఆర్‌ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డికి 762, కాంగ్రెస్ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డికి 653 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థి సుదర్శన్‌గౌడ్‌కు ఒక్క ఓటు వచ్చింది. కోటా ఓట్ల కన్నా 109 ఎక్కువ రావడంతో నవీన్‌కుమార్‌రెడ్డి గెలిచినట్లు రిటర్నింగ్ అధికారి రవినాయక్ ప్రకటించారు. అనంతరం ఎన్నికైనట్లు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. కాగా, కౌంటింగ్‌కు పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధుల హక్కుల కోసం పోరాడుతానన్నారు. తన విజయానికి కృషి చేసిన ప్రతిఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు.



లెక్కింపు కోసం బ్యాలెట్ పేపర్లను సిద్ధం చేస్తున్న సిబ్బంది


## కాంగ్రెస్ పతనం ప్రారంభం

- బీఆర్‌ఎస్ గెలుపు సర్కారుకు చెంపపెట్టు
- ఓటేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు
- మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి



విజయ సంకేతం చూపుతున్న నవీన్, చిట్టెం

మక్తల్ టౌన్, జూన్ 2 : స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయం కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాలమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం జరిగిన ఉమ్మడి పాలమూరు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపులో కాంగ్రెస్ అభ్యర్థిపై బీఆర్‌ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి విజయం సాధించడం యావత్ రాష్ట్రాన్ని సంతోషపెట్టిందన్నారు. స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థికి ఓటేసిన ఎంపీటీసీలు, ఎంపీపీలకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పతనం పాలమూరు నుంచే ప్రారంభమైందని.. త్వరలోనే ఆ పార్టీకి ఎదురుదెబ్బ తగులుతుందన్నారు. అధికారం కోసం అలివికాని హామీలిచ్చి.. ప్రభుత్వం ఏర్పాటయ్యాక దొంకతిరుగుడు సమాధానాలు చెబుతూ ప్రజలను మోసం చేసిన ఘనత కాంగ్రెస్‌కే చెల్లిందన్నారు. రాష్ట్రాభివృద్ధిని పక్కన పెట్టి స్వలాభం కోసం మంత్రులు, ఎమ్మెల్యేలు పనిచేస్తున్నారని దుయ్యబట్టారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజునే బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎన్నికల్లో విజయం సాధించి రాష్ట్రంలో కేసీఆర్ మార్క్‌ను చూపించారన్నారు.





హైదరాబాద్‌లో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆలింగనం చేసుకున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

# అవతరణోత్సాహం

- ఉమ్మడి జిల్లాలో అట్టహాసంగా తెలంగాణ దశాబ్ది వేడుకలు
- జాతీయ జెండా విష్కరించిన కలెక్టర్లు
- హాజరైన ఎమ్మెల్యే, అధికారులు

*తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు అట్టహాసంగా జరిగాయి. ఆదివారం ఉమ్మడి పాలమూరు జిల్లాలో వేడుకలు అంబరాన్నంటాయి. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు. విద్యుద్దీపాల కాంతుల్లో అందంగా ముస్తాబు చేసిన ఐడీవోసీ, ఎస్పీ, పోలీస్ పరేడ్‌గ్రౌండ్ల వద్ద కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఎస్పీలు జెండాలను ఎగురవేశారు. అమరుల స్తూపాల వద్ద నివాళులర్పించారు. అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు. వివిధ పార్టీల కార్యాలయాల వద్ద జరిగిన కార్యక్రమాల్లో నాయకులు పాల్గొన్నారు.* - నెట్‌వర్క్ మహబూబ్‌నగర్, జూన్ 2



నారాయణపేట కలెక్టర్

జోగుళాంబ గద్వాల కలెక్టర్

వనపర్తి కలెక్టర్

మహబూబ్‌నగర్ కలెక్టర్

జెండావిష్కరిస్తున్న నాగర్‌కర్నూల్ కలెక్టర్